# వాస్తవం
డెయిలీ.కామ్
ఉన్నది ఉన్నట్లుగా
డిజిటల్ పత్రిక
శుక్రవారం 14.08.2026
ఎడిటర్: ఎం.కృష్ణారెడ్డి(కె.ఆర్)


## దండం పెడ్తున్నా.. వరి వేయొద్దు

**ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడవు**

**రైతులకు ఏఈవో వినూత్న వేడుకోలు**



నల్లగొండ, ఆగస్టు 13 : 'ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడేలా లేవు.. వరి సాగు చేయొద్దు.. దండం పెడు తున్నా.. అర్థంచేసుకొని మా ఆవేదన వినండి' అని నల్ల గొండ జిల్లా ఉదయ సముద్రం చెరువు కింద నాట్లు వేస్తున్న రైతులకు మో కాళ్లపై కూర్చొని దండం పెడు తూ విజ్ఞప్తి చేశారు పానగల్ ఏఈవో దేవేందర్. అయితే ఈ వేడు కోలుకు సం బంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ కావటంతో రైతులతోపాటు నెటిజన్లు సదరు ఏఈవోతోపాటు రాష్ట్ర ప్రభుత్వంపై వ్యతిరేక పోస్టులు పెట్టారు. 'ఎల్ నినో ప్రభావం ఉంటే అసలే వర్షాలు రాకుండా ఉంటలేదు కదా? బోరు బావులు కింద కూడా వ్యవసాయం చేయొద్దా?'అంటూ మండిపడ్డారు.

## వర్షాకాల సమావేశాలకు తెర

**లోక్‌సభ నిరవధిక వాయిదా**

**చర్చ లేకుండా 10 బిల్లులు పాస్**

**చివరి రోజు మోదీ, షా హాజరు**




**న్యూఢిల్లీ:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు గురువారం తెరపడింది. ఢిల్లీలో విద్యార్థులపై పోలీసుల కాల్పులు, అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణలపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర విరసనలు వెల్లువెత్తడంతో వర్షాకాల సమావేశాల్లో వాయిదాల పర్వం కొనసాగింది. ఎలాంటి చర్చ లేకుండానే పలు కీలక బిల్లుల ఆమోదం పొందగా సమావేశాల ప్రారంభం నుంచి సభలో కనిపించని ప్రధాని మోదీ, హోమ్ మంత్రి అమిత్ షా చివరి రోజు లోక్‌సభలో ప్రత్యక్షమయ్యారు. గురువారం ఉభయ సభలు సమావేశం కాగానే వందేమాతరంలోని ఆరు చరణాలు వినిపించారు. పార్లమెంట్ చరిత్రలో ఇలా జరగడం ఇదే మొదటిసారి. ఆ తర్వాత స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. సమావేశాల కాలంలో సభ పనితీరు ప్రస్తావిస్తూ ఇచ్చే సాధారణ ముగింపు ప్రసంగాన్ని బిర్లా చదివి వినిపించలేదు. చర్చలో పాల్గొనాలని బిర్లా విపక్ష సభ్యులను పదేపదే కోరినప్పటికీ ప్రతిపక్షం తమ నిరసనలను కొనసాగించడంతో సభ పలుమార్లు వాయిదా పడింది. గురువారం కూడా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జూలై 20న ప్రారంభమైన ఈ సమావేశాల్లో నీట్ పశ్న పత్రం లీక్ వ్యవహారం, అయోధ్యలోని రామ మందిరంలో విరాళాల చోరీ ఆరోపణలపై ప్రతిపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. రాజ్యసభ ఆమోదించిన రెండు బిల్లులు సహా మొత్తం 12 బిల్లులు ఈసారి సమావేశాల్లో ఆమోదం పొందాయి. దీంట్లో 10 బిల్లులు ఎలాంటి చర్చ లేకుండా ఆమోదం పొందటం గమనార్హం.

## ఏఐతో ఉద్యోగాలు తగ్గిపోవు

**మార్క్ జుకర్‌బర్గ్ ఆసక్తికర వ్యాఖ్యలు**



ఢిల్లీ: కృత్రిమ మేధస్సు కారణంగా భారీగా ఉద్యోగాలు కనుమరుగవుతాయన్న ఆందోళనల మధ్య మెటా సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ కారణంగా కంపెనీల పరిమాణం తగ్గినప్పటికీ, మొత్తంగా ఉద్యోగాల సంఖ్య తగ్గదని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. జుకర్‌బర్గ్ ఆగస్టు 10న మెటా వెబ్‌సైట్‌లో ఒక వ్యాసాన్ని పోస్ట్ చేశారు. ఆ వ్యాసంలో ఏఐ భవిష్యత్తు, ఉద్యోగాలు, వ్యాపారాలపై జుకర్‌బర్గ్ తన అభిప్రాయాలను వెల్లడించారు. ఏఐ మానవుల ప్రాధాన్యతను పూర్తిగా తొలగిస్తుందని భావించడం సరైనది కాదని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కంపెనీల పరిమాణం తగ్గే అవకాశం ఉందని జుకర్‌బర్గ్ అన్నారు. అయితే దాని అర్థం ఉద్యోగాలు తగ్గిపోవడం కాదని స్పష్టం చేశారు. తక్కువ మంది ఉద్యోగులతో పనిచేసే మరిన్ని చిన్న కంపెనీలు ఏర్పడొచ్చన్నారు. అవి ఏఐ సహాయంతో పెద్ద సంస్థల స్థాయిలో ప్రభావం చూపే అవకాశం ఉందని వివరించారు. చిన్న వ్యాపారాల అభివృద్ధికి ఏఐ ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. చిన్న వ్యాపారాలు ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా కొనసాగుతాయని, ఏఐ కారణంగా ఒక్కో చిన్న సంస్థ ప్రభావం మరింత పెరుగుతుందని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందిన ప్రతిసారీ కొత్త ఉద్యోగాలు పుట్టుకొచ్చాయని జుకర్‌బర్గ్ గుర్తుచేశారు. ఒక తరం క్రితం యాప్ డెవలపర్లు, సామాజిక మాధ్యమ కంటెంట్ సృష్టికర్తలు, విద్యుత్ వాహన సాంకేతిక నిపుణులు, డేటా సెంటర్ ఉద్యోగాలు ఇంతగా ఉండేవి కావని పేర్కొన్నారు .ఏఐ విస్తరణతో ప్రస్తుతం ఊహించలేని కొత్త రకాల ఉద్యోగాలు కూడా పుట్టుకొస్తాయని ఆయన అన్నారు . ఏఐ ప్రధానంగా ఆటోమేషన్ సాధనంగా కాకుండా కొత్త ఆవిష్కరణలకు ఉపయోగపడే సాధనంగా మారొచ్చని జుకర్‌బర్గ్ అభిప్రాయపడ్డారు. ఏఐ వల్ల కొన్ని ఉద్యోగాల స్వరూపం తప్పకుండా మారు తుందని, అయితే ఆ మార్పు మొత్తం ఆర్థిక వ్యవస్థలో ఉద్యోగాల కొరతకు దారితీయకపోవచ్చని పేర్కొన్నారు.

### కరువు రావాలె.. జనాలు చచ్చిపోవాలే అని

# చేతబడులు చేసినా

# దేవుడు మా దిక్కే




**పదేళ్లు అధికారంలో ఉండి .. చేతబడి చేస్తారా?**

**ఆ చేతబడి తిరగబడితే ఏమైతదో తెలుసు**

**బుద్ధి సక్కగా లేకపోతే చేతబడి కూడా తిరగబడతది**

**ఫార్మ్ హౌస్‌లో నుంచి బయటికి వెళ్లకుండా అయితది**

**తిరగబడి మిమ్మల్నే అష్ట దిగ్బంధం చేస్తది**

**వాళ్లు అఘోరా పూజలు చేసినా దేవుడు మా దిక్కే**

**ఎల్‌నినో వచ్చినా ఎల్లంపల్లి నిండింది**

**సమస్య లేకుండా దేవుడు వానలు కురిపించాడు**

**డబుల్ బెడ్రూమ్ ఇస్తామంటూ ఊరించారు.. కానీ ఇవ్వలేదు**

**మేం ఇప్పుడు కోట్ల విలువజేసే భూముల్లో ఇళ్లు కడుతున్నాం**

**ఇందిరమ్మ ఇళ్ల శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్**

**ఎల్‌నినో వచ్చింది.. మొత్తం ఎక్కడికక్కడ ఎండిపోతుం దని అన్నారు. కానీ, ఎల్‌నినో వచ్చిన సమయంలోనే ఎల్లంపల్లి నిండింది. హైదరాబాద్‌కి తాగునీటి సమస్య లేకుండా దేవుడే వానలు కురిపించాడు.**



**హైదరాబాద్ , ఆగస్టు 13 :**

"ఎల్‌నినో వచ్చింది.. మొత్తం ఎక్కడికక్కడ ఎండిపోతుం దని అన్నారు. కానీ, ఎల్‌నినో వచ్చిన సమయంలోనే ఎల్లంపల్లి నిండింది. హైదరాబాద్‌కి తాగునీటి సమస్య లేకుండా దేవుడే వానలు కురిపించాడు. కొంతమంది మాత్రం కర్ణాటక, తమిళనాడు పోయి 'కరువు రావాలె.. జనాలు చచ్చిపో వాలే.. ఈ ప్రభుత్వం బద్నాం కావాలి' అని అఘోరా పూజలు చేశారు. అట్లాంటి దుర్మార్గులు ఎంత ఘోరంగా అఘోరా పూజలు చేసినా దేవుడు వాళ్ల దిక్కు లేడు. దేవుడు మన దిక్కే ఉన్నాడు. ఎందుకంటే మన సంకల్పం మంచిది" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానిం చారు. తాను గొప్ప తెలివి కల వాడినని, పెద్ద పెద్ద చదు వులు చదువుకున్నానని చెప్పనని, కానీ, పది మందికి మేలు చేయాలన్న ఆలోచన తనకు ఉందని చెప్పారు. తనను దేవుడు కాపాడడానికి అది ఒక్కటీ చాలునని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి మంత్రులు పొం గులేటి శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్‌బాబుతో కలిసి గురు వారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలన్నారు. "అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని చందంగా కేసీఆర్ పరిస్థితి ఉంది. "పదేళ్లు అధికారంలో ఉండి పక్క రాష్ట్రాలకు పోయి చేతబడి చేస్తారా? ఆ చేతబడి తిరగబడితే ఏమైతదో తెలుసు. బుద్ధి సక్కగా లేకపోతే చేతబడి కూడా తిరగబడతది. ఫార్మ్ హౌస్‌లో నుంచి బయటికి వెళ్ల కుండా అయితది. తిరగబడి మిమ్మల్నే అష్ట దిగ్బంధం చేస్తది" అని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రిని టీవీలో తప్ప ఎప్పుడైనా నేరుగా చూశారా అని ప్రశ్నిం చారు. తాను మీ మధ్యనే తిరుగుతున్నానని చెప్పారు. మంచి మనసుతో మంచి ఆలోచనతో వచ్చానని, అభివృద్ధిలో తనకు రాజకీయాలు లేవని తెలిపారు. అం దరూ సహకరిస్తే అద్భుతమైన తెలంగాణ, హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేసుకుం దామని అన్నారు. ఒడి దుడుకులను అధిగమించి.. ఆర్థికంగా నిలదొక్కు కొని.. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి తనకు శక్తిని, ఆశీర్వాదాన్ని ఇవ్వాలని కోరారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు అసలు, మిత్తి కడుతూనే ఇన్ని మంచి పనులు చేస్తున్నానని తెలిపారు. "వయసు, ఓపిక ఉంది. మీ కోసం పని చేయాలన్న సంకల్పం ఉంది. విధ్వంసమైన తెలంగాణను వికాసం వైపు నడిపించడానికి రోజుకు 12-18 గంటలు పనిచేసే శక్తి దేవుడు ఇచ్చాడు. గతంలో ఉన్న పథకాలు కొనసాగిస్తూ అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నాం" అని వివరించారు. ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగులకు ఇండ్ల స్థలాలు, కాలనీలు కాంగ్రెస్ ఇచ్చిందని, ఇయ్యాల ఆ సంప్రదాయమే దెబ్బతిన్నదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

"'అహ నా పెళ్లంట' సినిమాలో కోట శ్రీనివాసరావు పైన కోడిని కట్టి కింద ఉత్తన్నం తిన్నట్టు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు అంటూ పేదోళ్లందరికీ ఊరిచ్చి ఊరిచ్చి చెప్పారు. ఇందిరమ్మ ఇల్లంటే డబ్బా ఇల్లన్నారు. అవి వద్దే వద్దు అన్నారు. మేం డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇస్తానని చెప్పారు. ఎంతమందికి ఇచ్చారు? ఎవరికన్నా వచ్చినాయా?" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి సభికులను అడిగారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లను కొల్లూరు, మేడ్చల్ అవతల కడితే పోయేది ఎన్నడు.. ఉండేది ఎన్నడు.. వాపస్ వచ్చేది ఎన్నడని ప్రశ్నించారు. పనులు చేసుకొని పోయే సరికి మధ్య రాత్రి అయితదని, పిల్లలు పండుకొంటారని విమర్శించారు. "ఇయ్యాల మా శ్రీనివాస్ రెడ్డి ఆలోచన చేసిండు. నాతోని పంచాయితీ పెట్టుకున్నాడు. ఇది చాలా విలువైన భూమి అని, ఇలా అయితే ఎలా అంటే.. మనం మాట ఇచ్చినం.. లక్ష ఇళ్లు కట్టాల్సిందేనని పట్టు బట్టారు. కూకట్‌పల్లిలో పాన్ డబ్బా అంతా జగ కావాలంటే 20 లక్షలు కావాలి. అట్లాంటిది.. 11 ఎకరాల భూమిని ఇందిరమ్మ ఇండ్లు కట్టి ఇయ్యాల్సిందేనని పట్టుబట్టాడు. ఇక్కడ పని చేసేటోళ్లకి ఇక్కడే ఇవ్వాలని, ఎక్కడ ఉండేటోళ్లకి అక్కడే ఇళ్లు కట్టాలని స్పష్టం చేశాడు. ఒక మంచి సంకల్పంతో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అద్భుతమైన కార్యక్రమం తీసుకున్నాడు" అంటూ ఆయన్ను, హౌసింగ్ శాఖ అధికారులను సీఎం అభినందించారు.

# దిగొచ్చిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా




**దేశ వ్యాప్తంగా లాయర్లు, ప్రతిపక్షాల నుంచి వెల్లువెత్తిన నిరసనల అనంతరం బార్ కౌన్సిల్ అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్రా ప్రకటన విడుదల**

9లో.. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్

**నల్సార్ వర్సిటీ విద్యార్థులు అడ్వకేట్లుగా నమోదు చేసుకోవచ్చని ప్రకటన**

హైదరాబాద్ 'నల్సార్' విశ్వవిద్యాలయం చుట్టూ తిరుగుతున్న రాజకీయ, న్యాయపో రాటం అనూహ్య మలుపులు తిరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కాన్వొకేషన్‌కు ముఖ్య అతిథిగా పిలవడాన్ని నిరసిస్తూ కొంత మంది విద్యార్థులు చేపట్టిన ఉద్యమం తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారంలో అత్యంత ఘాటుగా స్పందించిన భారత బార్ కౌన్సిల్ , నల్సార్ 2026 బ్యాచ్‌కి చెందిన లా విద్యార్థులెవ్వరినీ అడ్వకేట్లుగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు సం చలన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయంపై నలుమూలల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవ్వడం, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో బీసీఐ కొద్ది గంటల్లోనే తన ఆదేశాలను సవరించుకుని నిషేధాన్ని ఉపసంహరించుకుంది.

## త్వరలో బొగ్గు ఎక్స్ఛేంజ్

**దేశమంతా ఒకే ధరకు బొగ్గు**

**కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి**



**ఢిల్లీ:** దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛేంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అంశంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. పన్నులు, సెస్‌ల విషయం లోనూ కేంద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశంలో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# కోడి పందేల స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

**16 మంది అరెస్ట్**
**రూ.24,040 నగదు**
**18 ద్విచక్ర వాహనాలు స్వాధీనం**

**వాస్తవం : చెన్నూరు ఆర్సీ**

రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని నీల్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో వేమనపల్లి మండలం కల్లెంపల్లి గ్రామ శివారులో కోడి పందేల పేరుతో బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శ్రీనివాస్ నేతృత్వం లో ఎస్సై రమేష్, నీల్వాయి ఎస్సై నాగ రాజు సిబ్బందితో కలిసి బుధవారం అర్ధరాత్రి దాడి నిర్వహించారు. ఈ దాడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 4 కోళ్లు, 45 కత్తులు, 18 ద్విచక్ర వాహనాలు, 12 మొబైల్ ఫోన్లు, రూ. 24,040 నగదును స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న 16 మందితో పాటు స్వాధీనం చేసుకున్న నగదు, వస్తువులు, ద్విచక్రవాహనాలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం నీల్వాయి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన వారి వివరాలు.. కుడిమెత సాయి, జన్నె కమలాకర్, బంద్రకంటి కోటేష్, తేలిగె సాయి, చౌదరి తిరుపతి, ఆత్రం సందీప్, మొగిలి మల్లేష్, మంచాల హనుమంతు, ఎనుముల మధుకర్, మానేపల్లి రాజన్న, కార్పేట తిరుపతి, దండేర మహేష్, సతిపతి రాజశేఖర్, దోమల మల్లేష్ తదితరులు ఉన్నారు. ప్రభుత్వం నిషేధించిన, చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. కోడి పందేలు, జూదం, బెట్టింగ్ తదితర చట్ట విరుద్ధ కార్యకలాపాలకు ఎవరూ పాల్పడవద్దని సూచించారు. ఇలాంటి కార్యకలాపాలకు స్థావరాలు ఏర్పాటు చేయడం, నిర్వహించడం, వాటికి సహకరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



ప్రజలు కూడా చట్టవిరుద్ధ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన పోలీసుల దృష్టికి తీసుకురావాలని , సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీపీ తెలిపారు.

# ముగిసిన కన్వర్ యాత్ర

**హరిద్వార్‌లో పేరుకుపోయిన 7,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు**



**హరిద్వార్ :** ఈ ఏడాదికి సంబంధించిన కన్వర్ యాత్ర ముగిసింది. ఈ యాత్రలో భాగంగా దాదాపు ఐదు కోట్ల మంది శివ భక్తులు దేవభూమిగా పిలిచే ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ సందర్శించారు. అక్కడి పవిత్ర గంగా జలాల్ని తీసుకెళ్లారు. అయితే, ఈ యాత్ర సందర్భంగా హరిద్వార్‌లో భారీగా చెత్త పేరుకుపోయింది. కోట్లాది మంది భక్తుల రాకతో ఇక్కడి అనేక ప్రాంతాలు భారీ వ్యర్థాలతో నిండిపోయాయి. దీనికి సంబంధించిన వివరాలు వెల్లడయ్యాయి. అధికారుల అంచనా ప్రకారం.. హరిద్వార్‌లోని గంగా నది ఘాట్‌లైన హర్‌కి పూరి సహా పలు ఘాట్‌లలో భారీ వ్యర్థాలు పేరుకుపోయాయి. దాదాపు 7,000 మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పేరుకుపోయినట్లు అధికారుల అంచనా. వేలకొలది వాటర్ బాటిళ్లు, మల వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, దుస్తులు, అండర్ వేర్స్, చెప్పులు వంటివి ఎక్కడ చూసినా కనిపిస్తున్నాయి. పరిసరాల్ని అపరిశుభ్రంగా, వ్యర్థాలతో నిండి, దుర్వాసన వస్తున్నాయి. మహిళలు దుస్తులు మార్చుకునే రూమ్లు కూడా చెత్తతో నిండిపోయాయి. దీంతో ఇప్పుడు ఈ వ్యర్థాల నిర్వహణ ఇప్పుడు అక్కడి అధికారులకు సవాలుగా మారింది. వ్యర్థాలు సేకరించడం, వేరు చేయడం, పరి సరాల్ని శుభ్రం చేయడం కోసం యుద్ధప్రాతిపదికన పని చేయాల్సి వస్తోంది. వ్యర్థా ల సేకరణ కోసం 1,000 మంది వరకు పారిశుధ్య సిబ్బంది పని చేస్తున్నారని స్తానిక మున్సిపల్ కమిషనర్ నంద కుమార్ తెలిపారు. ఆగష్టు 12 నుంచి వ్యర్థాల తొలగింపు కొనసాగుతోందని, ఆగష్టు 18 వరకు సాగుతుందని వెల్లడించారు. వ్యర్థాల సేకరణ, రవాణా కోసం 80 వాహనాల్ని వినియోగిస్తున్నామని వివరించారు. ఈ వ్యవహారం మొత్తాన్ని డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ల ద్వారా వ్యర్థాల్ని గుర్తించి, తొలగిస్తున్నామని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. స్వచ్ఛంద సంస్తలు, కార్యకర్తలు కూడా ఇందులో భాగ స్వాములయ్యారు.

# కలెక్టర్ కార్యాలయానికి కదం తొక్కిన బీడీ కార్మికులు

**బీడీ కార్మికులకు**
**ఆసరా పెన్షన్ దరఖాస్తు చేసుకునే**
**అవకాశం కల్పించాలి**
**నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం**
**ముందు ధర్నా**

**వాస్తవం : నిర్మల్ జిల్లా ప్రతినిధి**

బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్ పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తూ. గురువారం తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో, నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు వందలాది బీడీ కార్మికులతో ధర్నా నిర్వహించారు. సందర్భంగా హాజరైన తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ మాట్లాడుతూ బీడీ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలాది మంది కార్మికులు అనేక సంవత్సరాలుగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వయసు పైబడిన బీడీ కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పెన్షన్ పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించకపోవడం అన్యాయ మని పేర్కొన్నారు. ప్రజాపాలన అంటే బీడీ కార్మికులకు ఆసరా పెన్షన్‌ను దూరం చేయడమేనా అని విమర్శించారు. త్వరలోనే రాష్ట్ర సచివాలయంలో నిర్వహించే ప్రజవానికి వెళ్ళి మంత్రులను, అధికారులను కలుస్తామని తెలిపారు. టీ యూ సి ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కట్ట రాజన్న మాట్లాడుతూ. బీడీ కార్మికులు తమ జీవితకాలంలో కష్టపడి పనిచేసి ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చుతున్నప్పటికీ, వృద్ధాప్యంలో కనీస జీవన భద్రత లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి బీడీ కార్మికుడికి ఆసరా పెన్షన్ అందేలా ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీడీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎం. బక్కన్న , జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రామలక్ష్మణ్ ,జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, జిల్లా కోశాధికారి ఎమ్.డి.గఫూర్ జిల్లా కమిటి సభ్యుడు కే.లక్ష్మీ, ఎస్.లక్ష్మీ, వి.గోదావరి.వి.మహేందర్ మరియు వందలాది మంది బీడీ కార్మికులు పాల్గొన్నారు.




# ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

**ఎమ్మెల్యే మందుల సామేలు**



**వాస్తవం : అడ్డగూడూరు :**

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో సర్పంచ్ మేకల మేరీ ఆనంద్ తన సొంత ఖర్చులతో నిర్మించిన నూతన దేవాలయాలలో ముత్యాలమ్మ, మారెమ్మ, మాంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపనకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇచ్చిన మాట తప్పకుండా తన సొంత ఖర్చులతో ముత్యాలమ్మ, మారెమ్మ, మహంకాళమ్మ గుడులను నిర్మించిన సర్పంచ్ మేరీ ఆనంద్ ను ఘనంగా శాలువాతో సన్మానించి, అభినందించారు. ముత్యాలమ్మతల్లి ఆశీస్సులతో ధర్మారం గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. త్వరలో బొడ్రాయి పండుగ ఘనంగా జరిపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, సీనియర్ నాయకులు గోవిందు చిన్నయ్య, పాశం సత్య నారాయణ, జోజి, చెడే చంద్రయ్య, రవీందర్ రావు, వేద పండితులు పాలకుర్తి గౌతమి శర్మ, గ్రామ పురోహితులు వళ్ళంభట్ల మధుసూదన శర్మ, ఉపసర్పంచ్ కత్తుల నరేష్, వార్డు సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రాగం సుజాత యాదవ్ మృతిపై నేతల సంతాపం

**-కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**



**వాస్తవం : శేరిలింగంపల్లి, ఆగస్టు 13 :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్‌పర్సన్‌గా గతంలో బాధ్యతలు నిర్వహించిన రాగం సుజాత నాగేందర్ యాదవ్ మృతి పట్ల శేరిలింగంపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆమెతో తమకున్న అనుబంధాన్ని, జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నల్లగండ్ల గ్రామానికి చెందిన కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ సతీమణి అయిన సుజాత యాదవ్ కొంతకాలంగా శ్వాస సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్నారు. గురువారం హైటెక్ సిటీ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. శుక్రవారం ఉదయం స్వగృహం వద్ద అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో

# విద్యార్థులతో దేశభక్తి ర్యాలీ




**వాస్తవం , రామగుండం , ఆగస్టు, 13.**

పాలకుర్తి మండలం కుక్కలగూడూర్ గ్రామంలో మండల అధ్యక్షులు మెరుగు నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలతో దేశభక్తి ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులకు జాతీయ పతాకాలను అందజేసి, ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి భావాన్ని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, కందుల సంధ్యారాణి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, యువత దేశ సేవలో ముందుండాలని ఆమె అన్నారు. జాతీయ జెండా మన దేశ గౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమతి రాణి అధ్యాపకులు మరియు బిజెపి నాయకులు గోపు రామన్న, మేడం రాజు, శంకరయ్య ,మేడం మల్లయ్య, చల్ల హరీష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# మోత్కూర్ చేనేతకార్మిక సంఘం ఎన్నికలు





**వాస్తవం : మోత్కూర్**

మోత్కూర్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు వంగరీ రాములు అధ్యక్షతన గురువారం రోజున స్థానిక స్పూర్తి భవనంలో ఏకగ్రీవంగా జరిగింది. కార్యవర్గ గౌరవాధ్యక్షులుగా పసునూరి యాదయ్య ,పోచం కన్నయ్య ,అధ్యక్షునిగా పసునూరి సురేష్, ఉపాధ్యక్షులుగా వంగరి యాదగిరి, చిందం. శ్రీను, ప్రధాన కార్యదర్శిగా జల్ది. సోమయ్య కోశాధికారిగా దోర్నాల. మచ్చగిరి, సహాయ కార్యదర్శిగా రేగోటి. యాదగిరి, ప్రచార కార్యదర్శిగా ఎలగందుల. అమరేందర్, డైరెక్టర్లుగా బండారి. వాసుదేవ్, వేముల. దశరథ, గుర్రం. అంబదాసు, బంధనాదం ఏన్నయ్య, పోచం శ్రీను, పోచం సురేష్ లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో స్పూర్తి చైర్మన్ మంచే గోవర్ధన్, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కూరపాటి రాములు, తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీ నరసయ్య మండల పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు తాటి లక్ష్మణ్, మోత్కూర్ మున్సిపాలిటీ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు ఎలగందుల. సత్యనారాయణ, మోత్కూర్ మండల పద్మశాలి సంఘం కోశాధికారి పసునూరి. చంద్రయ్య, మోత్కూరు చేనేత సహకార సంఘం కార్యదర్శి మహేశ్వర మధుసూదన్, డైరెక్టర్లు పెండెం. రాజారాం, ఏలూరి. మచ్చగిరి ,రహీంఖాన్ పేట చేనేత సహకార సంఘం ఉపాధ్యక్షులు దోర్నాల. హరీష్ ,డైరెక్టర్ దోర్నాల. నరహరి, కొక్కుల. సత్యనారాయణ మరియు మోత్కూర్ చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు జెల్ది. రాములు, వంగరి .బాలరాజు, తవిటి. హరినాథ్, చించు. లక్ష్మయ్య, జిల్లా. సత్తయ్య, పసునూరి. నారాయణ, మహేశ్వరం ,ఏకాంబరం, గుర్రం.రవి, తదితర చేనేత కార్మికులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# స్నేహితురాలికి ఆర్థిక సాయం అందజేత

**వాస్తవం : మోత్కూర్**

భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న స్నేహితురాలికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. మోత్కూర్ మున్సిపల్ కేంద్రానికి చెందిన ఎస్ఎస్సి బ్యాచ్ స్నేహితురాలు బొడ్డుపల్లి. రజిత భర్త సంతోష్ కుమార్ ఇటీవల మృతి చెందగా రజిత స్నేహితులు మోత్కూర్ హైస్కూల్ 2002-03 ఎస్ఎస్ సీ బ్యాచ్ స్నేహితులు తలా కొంత వేసుకుని రూ.లక్ష సేకరించారు. గురువారం స్నేహితులు రజిత కుటుంబాన్ని పరామర్శించి మనోధైర్యం కల్పించి రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్నేహితులు ముశం. ఉపేంద్ర, చింతల. హేమలత, బత్తిని. విజయ, బొడ్డుపల్లి. గీత, జినుకల. సంగీత, ఎండి. కమురున్నిసా, బద్దం.మహేశ్వరి, ఎరసానిపల్లి. జయలక్ష్మీ, అవిశెట్టి. యాదగిరి, కూరెళ్ల. కృష్ణ, తేరాల. కృష్ణ, ఓర్సు. గోపాల్, బోయిని. వెంకటేష్, బుశిపాక. బందయ్య, గనగాని మహేష్, పానగంటి. సంతోష్, కూసంపల్లి. శ్రీను, చింత. నర్సింహా, కట్టెకోల. యుగంధర్ పాల్గొన్నారు.



# మారని అధికారుల తీరు

## పట్టించుకునే నాథుడే లేక పాయ ఎలక్షన్ ఉన్నపుడే మాత్రమే వాగ్దానాలు

**వాస్తవం : నిర్మల్ జిల్లా ప్రతినిధి:**

నిర్మల్ జిల్లా భైంసా పట్టణం నుండి కుబీర్ మండలంకు వెళ్లే రహదారి గుంతల మయం అయ్యిందని పలువురు నాయకులు ప్రజల నుంచి వినతులు అందుతున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. రోడ్లపై ప్రయాణికులు భయంతో ముందుకు వెళ్తున్నారు. నిత్యం భైంసా పట్టణానికి వందలాదిమంది పనులకు వెళ్తూ ఉంటారు విద్యార్థులు సైతం పాఠశాలకు వృద్ధులు గర్భిణీలు అనునిత్యం ప్రయాణం చేయాల్సిన రహదారి దుస్థితిని చూసి అధికారుల తీరు పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో చిన్నగా ఉన్న గుంతలు ప్రమాదకరంగా అవుతున్నాయి. భైంసా నుండి మహారాష్ట్ర కుబీర్ మండలం నుండి హిమాయత్ నగర కు ఈ రహదారిపై నుండే ప్రయాణం చేయాల్సిన పరిస్థితి. గుంతలు అధికారవడంతో నిత్యం



ఏదో ఒక చోట ప్రమాదాలు జరుగుతున్నాయి. భైంసా నుంచి ఈ వైపు వచ్చే వాహనదారులు జాగ్రత్తగా వస్తున్నా అదుపుతప్పి పడిపోతున్నారు. రాత్రి సమయంలో వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ముందుకు సాగుతున్నారు. భైంసా నుండి లింగీ దాబా వరకు కుబీర్ మండలం లోని వివేకానంద చౌరస్తా నుండి బస్టాండ్ వరకు గుంతలు అధిక సంఖ్యలో ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతు న్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి వేయాలనీ ప్రయాణికులు కోరుతున్నారు. ఎలక్షన్ వచ్చినప్పుడు మాత్రమే వాగ్దానాలు చేసి తర్వాత చేతులు దులుపుకుంటున్నారని. తర్వాత యథా రాజా తథా ప్రభ ..! అన్నట్లు ప్రజా ప్రతి నిధులు తీరు ఉంది. అని ఇప్పటికైనా ప్రజాప్రతి నిధుల బుద్ధి మారి ప్రజల కనీస అవసరాలకు రోడ్లు బాగు చేసి ప్రయాణికుల అవస్థలు తీర్చాలని. కోరుతున్నారు.

# హఫీజ్ పేట్ డివిజన్‌లో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా యాత్ర'

**వాస్తవం : శేర్లింగంపల్లి :**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా,శేరిలింగంపల్లి నియోజకవర్గం హఫీజ్ పేట్ డివిజన్‌లో హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ,హర్ ఘర్ తిరంగా కన్వీనర్,డాక్టర్ అజిత్ కుమార్ సేనాపతి,రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి తోపుగొండ మహిపాల్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపుతో నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా అభియాన్ ద్వారా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి దేశభక్తి స్ఫూర్తిని చాటాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు,టి ఏ సి మెంబర్ పోరెడ్డి బుచ్చిరెడ్డి ,బీజేపీ రాష్ట్ర మాజీ కౌన్సిల్ సభ్యులు కలివెముల మనోహర్ , బీజేపీ కిసాన్




మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరసింహ రావు, బీజేపీ నాయకులు రాజశేఖర్,మాజీ కౌన్సిలర్ రమణయ్య, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు రవి గౌడ్, శ్రీధర్ రావు ,బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆళ్ల వరప్రసాద్, బీజేపీ నాయకురాలు పార్వతీ, బీజేపీ నాయకులు పవన్ , సురేష్ కురుమ,హఫీజ్ పేట్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి జగన్ గౌడ్, మారెళ్ల వెంకటేశ్వర్లు ,డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షులు ప్రసాద్ పాత్రో, రాజు యాదవ్,బీజేపీ నాయకులు మోహన్ ముదిరాజ్,శేఖర్ ముదిరాజ్,రామ్ రెడ్డి, రామచంద్ర యాదవ్ ,అశోక్ ముదిరాజ్,కృష్ణ కాంత్,నాగేష్ పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం చేలగాటం

**ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్**




**వాస్తవం : సిరిసిల్ల**

భారత విద్యార్థి ఫెడరేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ లు విడుదల చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఏవోకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాజన్న సిరిసిల్ల జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 10,814 కోట్ల రూపాయలు పెండింగ్‌లో స్కాలర్షిప్‌లు, ఫీజు రియంబర్స్మెంట్ లు బకాయిలు ఉన్నాయని, వాటిని సకాలంలో విడుదల చేయకపోవడం ద్వారా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందని, సర్టిఫికెట్స్ కోసం ప్రైవేట్ కళాశాలలో చుట్టూ తిరుగుతూ డబ్బులు చెల్లించుకోలేక చదువును మధ్యలోను ఆపివేసే ప్రమాదం ఉందని అన్నారు. అనేక హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం విద్యార్థులను విస్మరించడం సరికాదన్నారు. వెంటనే పెండింగ్ స్కాలర్ షిప్ లు, ఫీజు రీయింబర్స్మెంట్‌లు విడుదల చేయకపోతే జిల్లాలో మంత్రులను, ఎమ్మెల్యేలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, జిల్లా నాయకులు సాయిరాం, రషీద్, విజయ్, బాలాజీ, ఆదిత్య, రేహాన్, మానస, అఖిల, ప్రియాంక, ప్రవళిక, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ చెక్కుల పంపిణీ



**వాస్తవం -మద్దూరు**

మండల పరిధిలోని గాగిల్లపూర్ గ్రామంలో సీఎంఆర్ పథకం కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మాజీ జెడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, గాగిల్లపూర్ సర్పంచ్ ఇట్టబోయిన కనకచంద్రం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేక మల్లేషంతో కలిసి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. గాగిల్లాపూర్‌కు చెందిన నారదాసు లక్ష్మికి 60 వేలు, కూటిగల్‌కు చెందిన చెప్పాల యాదగిరికి 60 వేలు , వలంపట్లకు చెందిన ఆలేటి శ్రీమతికి 30వేల చెక్కును అందజేశారు. సీఎంఆర్ పథకం ద్వారా లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందడం పట్ల నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చిట్కూరి కమలాకర్ యాదవ్, మద్దూరు–దూల్మిట్ట ఉమ్మడి మండల మాజీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్ గౌడ్, రేబర్తి సర్పంచ్ నీరాటి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ శివయ్య గౌడ్, జిల్లా సెక్రెటరీలు పద్మారెడ్డి, పుల్లూరు రాజు, జెల్లా శ్రీనివాస్, గాగిల్లాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి బాలయ్యతో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీపై ప్రత్యేక దృష్టి

**సర్పంచ్ శనిగరం సత్యనారాయణ**



**వాస్తవం : మద్దూరు**

మండల పరిధిలోని నర్సాయపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం గ్రామ పంచాయతీ సాధారణ సమావేశం సర్పంచ్ శనిగరం సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా తాగునీటి సరఫరా, విద్యుత్ దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ఉపాధి హామీ పథకంలో భాగంగా ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, బోర్ వెల్ రీచార్జ్ పాయింట్లు, వర్షపు నీటి సంరక్షణ పిట్ల నిర్మాణంపై చర్చించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు ఇంకుడు గుంతల ఏర్పాటు, పిట్టలగూడెం మరియు బస్టాండ్ సమీపంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం వంటి అంశాలను సమావేశంలో చర్చించారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తదితర అంశాలపై కూడా సభ్యులు చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఉప సర్పంచ్ మంతెన భరత్‌రెడ్డి, వార్డు సభ్యులు గట్టు సంతోష్, రాగుల బాలనర్సయ్య, దోప్ప కిషన్, చల్ల సంతోష్‌రెడ్డి, తుమ్మల శ్రీను, పంచాయతీ కార్యదర్శి పి. భాస్కర్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలి



**వాస్తవం : వేములవాడ**

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో భాగంగా రెండవ విడత ఉద్యమ కార్యక్రమంలో గురువారం వేములవాడ అర్బన్, రూరల్ మండలాల తహసిల్దార్‌లకు టిజేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాల కాలం గడిచినప్పటికీ చెల్లించవలసినటువంటి ఆరు డిఏ బకాయిలు, మూడు సంవత్సరాలుగా పి ఆర్ సి అమలు కాకపోవడానికి నిరసిస్తూ పాఠశాలలో ఉన్నటువంటి మౌలిక సదుపాయాలు పెంపొందించడానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టి జేఏసీ నాయకులు వికృతి అంజయ్య, వికృతి లక్ష్మీనారాయణ,బొజ్జ కృష్ణ,పి మహేష్, సిహెచ్. రామచంద్రం, పార్వతి తిరుపతి, మంగళగిరి చక్రపాణి పాల్గొన్నారు.

# హమాలీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

**సీఐటీయు ఆధ్వర్యంలో తహసిల్దార్‌కు వినతి**



**వాస్తవం : బెజ్జంకి**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మేనిఫెస్టోలో హమాలీలకు ఇచ్చిన హామీలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ సంఘ ఎల్లయ్య ఆధ్వర్యంలో గురువారం తహసిల్దార్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. మండల పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులు,సివిల్ సప్లై, జి సి జి జనరేజిస్, రైస్ మిల్లులు, దాల్ మిల్లులు, గిడ్డంగులు, వ్యాపార సంస్థలు,బజారు ముఠాలు కోల్డ్ స్టోరేజీలు కూరగాయలు పండ్ల మార్కెట్ రైల్వే సిమెంటు స్టీల్ తదితర రంగాల్లో పనిచేస్తున్న హమాలి కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆ వినతి పత్రంలో స్పష్టం చేశారు. తాసిల్దార్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో బి చంద్రయ్య, నరసింగం, శ్రీకాంత్,సత్తయ్య,రాజు తదితరులు ఉన్నారు.

# పోలింగ్ కేంద్రాలను పునర్వ్యవస్థీకరించాలి

**తహసిల్దార్‌కు వినతి పత్రం ఇచ్చిన బీజేపీ శ్రేణులు**



**వాస్తవం : బెజ్జంకి**

బెజ్జంకి మండలంలో పోలింగ్ కేంద్రాలను పునర్వ్యవస్థీకరించి కొత్త పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని బీజేపీ శ్రేణులు గురువారం తహసిల్దార్ శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలలో ఓటర్ల సంఖ్య అధికంగా ఉన్నందున ఎన్నికల సమయంలో ఓటర్లకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. బెజ్జంకి మండల కేంద్రంలో బూత్ నంబర్ 221 లో 1169 మంది ఓటర్లు ఉన్నందున ఆదనపు బూతు ఏర్పాటు చేయాలని తాసిల్దార్‌కి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు. మండలంలోని గుండారం గ్రామంలో బూతు నెంబర్ 315 లో 1204, బూత్ నంబర్ 316 లో 1232 మంది ఓటర్లు ఉన్నందున అదనపు బూతులు ఏర్పాటు చేయాలన్నారు. రామసాగర్ గ్రామానికి ప్రత్యేక పోలింగ్ స్టేషన్, పాపయ్యపల్లి, ఎల్లంపల్లి గ్రామాలకు ప్రత్యేకంగా పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. కల్లేపల్లి గ్రామ పరిధిలోని ఇట్టిరెడ్డిపల్లి, గుంటూరు పల్లి,తోటపల్లి గ్రామ పరిధిలోని సాలపల్లి, బేగంపేట గ్రామ పరిధిలోని తలారువానిపల్లి, వెన్నవాని పల్లి తదితర గ్రామాలలో అదనపు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసి ఓటర్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తహసిల్దార్ కి ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

# యూరియా నిల్వలపై రైతులకు సమాచారం అందించాలి

**బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు**

**వాస్తవం : బెజ్జంకి**



బెజ్జంకి మండలంలోని యూరియా నిల్వలను మండల రైతులకు తెలియపరచాలని బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు వ్యవసాయ అధికారులను కోరారు. గురువారం బెజ్జంకిలో విలేకరులతో మాట్లాడుతూ బెజ్జంకి మండలం లోని రైతులు యూరియా, ఇతర ఎరువుల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో రైతులకు అవసరమైన సమయంలో ఎరువుల సరఫరాపై ముందస్తు సమాచారం ఉండడంతో రైతులు సులభంగా ఎరువులు పొందేవారని, ప్రస్తుతం ఆన్‌లైన్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఏ రోజు, ఏ సమయంలో, ఏ ఎరువులు కేంద్రానికి యూరియా వస్తుందో స్పష్టమైన సమా చారం లేక రైతులు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఎరువుల కోసం రైతులు ఉదయం నుంచే కేంద్రాల వద్దకు చేరు కుంటున్నప్పటికీ, సరఫరా ఎప్పుడు జరుగుతుందో తెలియక సమయం, శ్రమ వృథా అవుతున్నాయని అన్నారు. ఎరువుల కొరత, కృత్రిమ కొరత, అధిక ధరలకు విక్రయించడం వంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ఎరువుల కేంద్రాలను నిరంతరం పర్యవేక్షించాలని డిమాండ్ చేశారు.

జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం
JSS JOURNALISTS SANKSHEMA SANGAM
Red 914/2015
జర్నలిస్టు సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టు హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

వాస్తవం



# దేశ ప్రజలందరూ దేశం కోసం, ధర్మం కోసం పనిచేయాలి

**ఆందోల్ బీజేపీ అధ్యక్షురాలు మాహిష్కర్ పావని**



**వాస్తవం : అందోల్**

దేశ ప్రజలందరూ దేశభక్తితో దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని అప్పుడే దేశాభివృద్ధికి పాటుపడిన వాళ్లమవుతామని ఆందోల్ బీజేపీ అధ్యక్షురాలు మాహిష్కర్ పావని అన్నారు. గురువారం జోగిపేటలో తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఆందోల్ జోగిపేట్ మున్సిపాలిటీలో భారీ పది మీటర్ల జాతీయ జెండా తో తిరంగాయాత్ర నుఎంతో ఘనంగా నిర్వహించారు. జ ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు మహేష్కర్ పావని గారు మాట్లాడుతూ మనకు స్వతంత్రం వచ్చి 80 సంవత్సరాలు అయినా సందర్భంగా తిరంగా ర్యాలీ నిర్వహిస్తు న్నామని దేశ ప్రజలందరూ దేశ భక్తితో దేశం కోసం ధర్మం కోసం పనిచేయాలని భారత దేశాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకోవెళ్లాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు పవన్,ఆందోల్ నియోజకవర్గం కో కన్వీనర్ మహేష్కర్ సుమన్ మాజీ ఆందోల్ అ సెంబ్లీ కన్వీనర్ ప్రభాత్,ప్రధాన కార్యదర్శి మ్యాదరి పాప య్య , యువమోర్చా నాయకులు కొర్పోల్ సర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, కార్తీక్ గౌడ్, రాంసాన్ పల్లి మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి , రోళ్ళపాడు మాజీ సర్పంచ్ నర్సింలు , నాయకులు గుండెగల నరసింహులు హరీష్, గణేష్ నరేష్, శ్రీనాథ్ సాయికుమార్ , మాణిక్యం, ప్రశాంత్ ,సాయిరాం, వినీత్, నాగరాజు , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెల్లాపూర్‌లో
# రూ.48 కోట్లతో ఆధునిక ప్రభుత్వ పాఠశాల

**ఆగస్టు 17న భూమిపూజ**
**ఎకరా స్థలంలో కేజీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యాబోధన**
**పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య ఉచితంగా అందించడమే లక్ష్యం**
**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



**వాస్తవం : పటాన్చెరు :**

పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా తెల్లాపూర్‌లో రూ.48 కోట్ల అంచనా వ్యయంతో అత్యాధునిక ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పటాన్చెరు శాసనసభ్యులు శ్రీ గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని తెల్లాపూర్‌లో ఎకరా విస్తీర్ణంలో నిర్మించనున్న ఈ పాఠశాలలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు ఒకే ప్రాంగణంలో విద్యాబోధన అందించనున్నట్లు వెల్లడించారు.గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి పాఠశాల నిర్మించనున్న తెల్లాపూర్‌లోని సర్వే నంబర్ 323, గద్దర్ విగ్రహం వెనుక ప్రాంతాన్ని ఎమ్మెల్యే పరి శీలించారు. పాఠశాల నిర్మాణానికి సంబంధించిన స్థల పరిస్థితులు, అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, నిర్మాణ ప్రణాళిక తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ విద్య అందించాలన్నదే తమ లక్ష్యమని తెలిపారు.ఆర్థిక స్తోమతతో సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి సమానమైన, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండాలని అన్నారు.ఒకే ప్రాంగణంలో ప్రీ-ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యను అందించడం ద్వారా విద్యార్థులకు నిరంతర విద్యా వాతావరణం కల్పించవచ్చని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన అన్ని సౌకర్యాలను పాఠశాలలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.విశాలమైన ఆటస్థలాలు, డిజిటల్ క్లాస్ రూమ్‌లు, అత్యాధునిక సైన్స్ ల్యాబ్‌లు, కంప్యూటర్ ల్యాబ్‌లు, సమృద్ధిగా పుస్తకాలతో లైబ్రరీలు, ఇతర ఆధునిక విద్యా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక పరిజ్ఞానం, సృజనాత్మకత వంటి అంశాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయనున్నట్లు చెప్పారు.పెరుగుతున్న జనాభా, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తెల్లాపూర్ ప్రాంతంలో ఆధునిక ప్రభుత్వ పాఠశాల అవసరం ఉందని, ఈ పాఠశాల అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాల్లోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వందలాది మంది విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.ఆగస్టు 17న నూతన ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వెల్లడించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగవంతంగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను సూచించారు.తెల్లాపూర్‌లో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న ఈ పాఠశాల భవిష్యత్ తరాలకు విద్యా కేంద్రంగా నిలవడంతో పాటు, ప్రభుత్వ విద్యా రంగంలో నూతన ప్రమాణాలకు నాంది పలుకుతుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జ్యోతి రెడ్డి, సీనియర్ నాయకులు సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే లక్ష్యం





**పటాన్‌చెరు నూతన కమిటీకి**
**టీయూడబ్ల్యూజే-ఐజేయూరాష్ట్ర అధ్యక్షులు**
**విరహత్ అలీ అభినందనలు**

**వాస్తవం : పటాన్చెరు :**

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం,సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులంతా సంఘటితంగా పనిచేయాలని టీయూడబ్ల్యూజే–ఐజేయూ రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ పిలుపునిచ్చారు. గురు వారం బషీర్‌బాగ్‌లోని టీయూడబ్ల్యూజే--ఐజేయూ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి, ఆధ్వర్యంలో, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు పత్తి నర్సింహా సమక్షంలో విరహత్ అలీని ఘనంగా సత్కరించారు. అనంతరం నూతనంగా ఏర్పాటైన పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గ టీయూడబ్ల్యూజే--ఐజేయూ కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.ఈ సందర్భంగా విరహత్ అలీ మాట్లాడుతూ.. జర్నలిజంపై అవగాహనతో పాటు వార్తలను సమర్థవంతంగా సేకరించి, వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకువచ్చే జర్నలిస్టులను సంఘంలో భాగస్వాములను చేయాలని అన్నారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులకు యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలో అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు అందేలా కృషి చేస్తామని చెప్పారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణతో పాటు వారి గౌరవం, భద్రతకు సంఘం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. అవసరమైన సందర్భాల్లో జర్నలిస్టులంతా ఐక్యంగా గొంతెత్తాలని పిలుపునిచ్చారు. సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బండారు యాదగిరి మాట్లాడుతూ.. పటాన్‌చెరు జర్నలిస్టుల సమిష్టి కృషి, సహకారంతోనే తాను అంచెలంచెలుగా జిల్లా స్థాయికి ఎదిగానని అన్నారు. పటాన్‌చెరు జర్నలిస్టులకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని, యూనియన్ బలోపేతానికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నత స్థాయి నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే--ఐజేయూ రాష్ట్ర నాయకులు అబ్దుల్ బాసీత్,జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్,ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న బసవేశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథ్, జిల్లా జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా జాయింట్ సెక్రటరీ భూపాల్ రెడ్డి, చిన్న,మధ్య తరహా పేపర్ల సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ ఈశ్వర్ చౌహాన్, పటాన్చెరు నియోజకవర్గం ఉపాధ్యక్షులు శివ కుమార్, శ్రీనివాస్,కోశాధికారి శ్రీనివాస్ రెడ్డి,ఈసీ మెంబర్లు శేఖర్, సిద్దు, పురుషోత్తం పాల్గొన్నారు.

**మేడిపల్లి పంచాయతీ నిధులపై**
# సమగ్ర విచారణకు డిమాండ్



**వాస్తవం : కాటారం**

కాటారం: మేడిపల్లి గ్రామ పంచాయతీలో నిధుల వినియోగంపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో అప్పాల భూమేష్ యాదవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. పీఓ ఉమాదేవి పంచాయతీ కార్యాలయానికి చేరుకుని విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పంచాయతీకి సంబంధించిన పలు రికార్డులను సీజ్ చేసి, నిధుల మంజూరు, ఖర్చులు, బిల్లులు, వౌచర్లు, తీర్మానాలు, అభివృద్ధి పనులు, చెల్లింపుల వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. రికార్డుల్లో చూపిన పనులు క్షేత్రస్థాయిలో జరిగాయా, బిల్లులు--వౌచర్లు, కొలతల వివరాలు సక్రమంగా ఉన్నాయా అనే అంశాలపై అధికారులు పరిశీలన చేస్తున్నారు.ఈ సందర్భంగా అప్పాల భూమేష్ యాదవ్ మాట్లాడుతూ ప్రజాధనానికి సంబంధించిన అంశం కావడంతో ప్రాథమిక విచారణకే పరిమితం కాకుండా జిల్లా స్థాయి అధికారులతో పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. నిధుల వినియోగంలో అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.

**ఉద్యమకారులను,కళాకారులను**
# గుర్తించి గౌరవించాలి

**రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి**




**వాస్తవం : వేములవాడ**

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనకు ప్రత్యేక కీలకపాత్ర వహించిన కళాకారులను గుర్తించి ప్రభుత్వం గౌరవం కల్పించాలని ఉద్యమ కళాకారుల రాష్ట్ర కన్వీనర్ యెల్ల పోశెట్టి కోరారు.తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం వేములవాడ ప్రధాన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో యెల్ల పోశెట్టి మాట్లాడుతూ కళాకారులను, ఉద్యమకారులను గుర్తించి ఆగస్టు 15 న ఆగస్ట్ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 33 జిల్లాలలోని అన్ని మండలాల కేంద్రాలలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అన్ని గ్రామ పంచాయతీల కార్యాలయం నందు సత్కరించవలసిందిగా కోరారు .తెలంగాణ ఉద్యమ కారుల కేకే కమిటీ కాలయాపన చేయకుండా సెప్టెంబర్ 17 లోపుగా అర్హులైన కళాకారులకు ఉద్యమకారులకు రూ. 25000 పెన్షన్, 250 గజాల ఇంటి స్థలాన్ని సాంస్కృతిక సారథిలో1000 మంది నిరుద్యోగ కళాకారులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు .ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ కళాకారుల విభాగం కన్వీనర్ బొడ్డు రాములు, దక్షిణ తెలంగాణ కళాకారుల విభాగం కన్వీనర్ వెన్నమల్ల వెంకటేష్, రాజన్న సిరిసిల్ల ఉద్యమ కళాకారుల విభాగం అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి వారాల దేవయ్య, హనుమకొండ జిల్లా అధ్యక్షులు నాగల సుధాకర్, మనువాడ దేవయ్య, తదితర కళాకారులు పాల్గొన్నారు.

# గీతంలో ఘనంగా ఫ్రెషర్స్ పార్టీ

**నూతన విద్యార్థులను స్వాగతించిన**
**స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్**





**వాస్తవం : పటాన్చెరు,ఆగష్టు 13**

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాదులోని స్కూల్ ఆఫ్ బిజినెస్, సైన్స్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్, హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో 2026-27 బ్యాచ్ కు ఘనంగా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించి, నూతన విద్యార్థులను ఘనంగా స్వాగతించాయి.సంగీతం, నృత్యం, స్కిట్లు, ర్యాంప్ వాక్‌లు, విద్యార్థుల ఉత్సాహభరితమైన ప్రదర్శనలతో గీతం ప్రాంగణమంతా కళకళలాడింది. ఫుడ్ స్టాల్స్, ఆటలు, ఫోటోబూత్‌లు పండుగ వాతావరణాన్ని మరింత పెంచాయి. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఫ్రెషర్స్‌కు తమ ప్రతిభను ప్రదర్శించడానికి, తోటి విద్యార్థులు, సీనియర్లతో మమేకమవ్వడానికి ఒక అవకాశాన్ని కల్పించాయి.విద్యార్థులు నేర్చుకోవడానికి, ఒకరితో ఒకరు మమేకమవ్వడానికి, తమను తాము వ్యక్తీకరించుకోవడానికి, చిరస్మరణీయమైన జ్ఞాపకాలను నిర్మించుకోవడానికి ప్రోత్సహించే ఉత్సాహభరితమైన ప్రాంగణ వాతావరణాన్ని సృష్టించాలనే గీతం నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించింది. తమ విశ్వవిద్యాలయ ప్రయాణానికి ఒక చిరస్మరణీయమైన ఆరంభాన్ని అందిం చినందుకు ఫ్రెషర్స్ తమ సీనియర్లకు కృతజ్ఞతలు తెలియజేయడంతో, ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

Publisher, Editor and Owned by Manasani Krishna Reddy, H No 4-81/1, Ramagundam, Elkalpalli, Karimnagar, Telangana - 505208.
Editor : MANASANI KRISHNA REDDY

# వివేకానందనగర్, వెంకటేశ్వర నగర్ వార్డుల్లో పౌర సమస్యల సమీక్ష

**వాస్తవం : శేరిలింగంపల్లి ఆగస్టు 13 :**



శేర్లింగంపల్లి నియోజకవర్గ పరిధిలో వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మరియు సంబంధిత శాఖల అధికారులతో కలిసి వివేకానంద నగర్ వార్డు, వెంకటేశ్వర నగర్ వార్డులను సందర్శించి స్థానిక ప్రజలతో సమావేశమై పౌర సమస్యలు, అభివృద్ధి అవసరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రజలు రోడ్లు, డ్రైనేజీ పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్యం, దోమల నియంత్రణ, పార్కుల సౌకర్యాలు, ఆక్రమణల తొలగింపు మరియు పాదచారుల మౌలిక సదుపాయాలు వంటి అంశాలను ప్రస్తావించారు. ప్రధానంగా కొనసాగుతున్న రోడ్డు పనుల పూర్తి, రోడ్లపై గుంతల మరమ్మతులు, డ్రైనేజీ లీకేజీలు మరియు నీటి నిల్వ సమస్యలు, అదనపు వీధి దీపాల ఏర్పాటు, క్రమం తప్పకుండా ఫాగింగ్, చెత్త మరియు నిర్మాణ వ్యర్థాల తొలగింపు, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ వంటి అంశాలు చర్చించబడ్డాయి. ప్రజలు ప్రస్తావించిన సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖలు మరియు సంస్థలతో సమన్వయం చేసుకొని, సాధ్యమైన పనులను ప్రాధాన్యతతో చేపట్టాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. గుర్తించిన పనులపై సకాలంలో తదుపరి చర్యలు చేపట్టి, పురోగతిని పర్యవేక్షించాలని సూచించారు. వన్ వార్డ్ ఎవరీ డే కార్యక్రమం ద్వారా ప్రజలతో నేరుగా మమేకమై, వార్డు స్థాయి పౌర సమస్యల పరిష్కారానికి సమన్వయంతో చర్యలు చేపడుతున్నారు.



# చట్టాలపై అవగాహనతోనే నేరాల నియంత్రణ

**ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి**

**వాస్తవం : డి హీరేహాళ్ ఆగస్టు 13**

ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి, నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి సూచించారు. గురువారం సాయంత్రం మండలంలోని నాగలాపురం గ్రామంలో గ్రామస్థులతో గ్రామ సభ నిర్వహించి రోడ్డు భద్రత, సైబర్ నేరాలు, పోక్సో చట్టం, బాల్య వివాహాల నిషేధం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడితే చట్ట ప్రకారం జరిమానా, ఇతర చర్యలు ఉంటాయని తెలిపారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పోక్సో, బాల్య వివాహాల చట్టాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామంలో ఇనుప చక్రాలతో వాహనాలు నడుపుతూ రోడ్లను దెబ్బతీస్తున్నారని గ్రామస్తులు తెలియజేయడంతో సంబంధిత వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోడ్ల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. అలాగే నేరాల నియంత్రణ, నేరస్థుల గుర్తింపులో సీసీ కెమెరాల ప్రాధాన్యతను వివరించారు. గ్రామంలోని ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు గ్రామస్తులు ముందుకు రావాలని ఎస్ఐ కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో నూతన అంబులెన్స్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**వాస్తవం , గోదావరిఖని, ఆగస్టు 13**

గోదావరిఖని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులతో సమకూర్చిన నూతన అంబులెన్స్‌ను గురువారం రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రికి నూతన అంబులెన్స్ అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆస్పత్రికి తరలించేందుకు అంబులెన్స్ సేవలు ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు మరింత అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ఎన్‌టీపీసీ సీఎస్ఆర్ నిధులతో అంబులెన్స్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు, వైద్య పరికరాలు, అత్యవసర సేవలను మెరుగుపరిచి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ అంబులెన్స్ ద్వారా అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులకు వేగంగా సేవలు అందించడంతో పాటు, అవసరమైన సందర్భాల్లో మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు తరలించేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే అంబులెన్స్ డ్రైవింగ్ చేసి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేటర్లు, ఆస్పత్రి అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఎన్‌టీపీసీ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రావణ శోభ

**ఆగస్ట్ 13 నుంచి సెప్టెంబర్ 11 వరకు ఆధ్యాత్మిక కార్యక్రమాలు.. భారీ ఏర్పాట్లు**

**వాస్తవం : పటాన్చెరు,ఆగష్టు 13 :**



సంగారెడ్డి జిల్లా బీరంగూడ గుట్ట శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీ నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకు పలు ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ప్రహ్లాద్, ఆలయ చైర్మన్ సుధాకర్ యాదవ్, దేవాదాయ శాఖ ఈవో దేవనాదం తెలిపారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు కార్యక్రమాల వివరాలను వెల్లడించారు. శ్రావణమాసం సందర్భంగా ప్రతి మంగళవారం, శుక్రవారం ఉదయం 9 గంటలకు మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి సోమవారం ఉదయం రుద్రహోమం, స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ఉదయం ప్రత్యేకంగా చండీ హోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 6న ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఉదయం స్వామివారికి విశేష అభిషేకం నిర్వహించి, సాయంత్రం 6 గంటలకు పల్లకి సేవ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 10న మాస శివరాత్రి సందర్భంగా ఉదయం 9 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సెప్టెంబర్ 8 త్రయోదశి సాయంత్రం 6 గంటలకు నందీశ్వరునికి ప్రత్యేక అభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 23, సెప్టెంబర్ 7 తేదీల్లో ఏకాదశి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అన్ని కార్యక్రమాల్లో విశేషంగా, పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని, కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


జర్నలిస్టు సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్టు సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్టు హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110


## సింగరేణి జిడికె-2 , 2ఏ ఇంక్లైన్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు




**వాస్తవం, గోదావరిఖని, ఆగస్ట్ 13:**

గోదావరిఖని సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ మారుతి ఆధ్వర్యంలో గురువారం జిడికె 2 అండ్ 2ఏ ఇంక్లైన్‌లో, జిడికె 2 సెక్షన్ నందు ' సురక్షక తిరంగా' సైబర్ అవేర్నెస్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై మారుతి సైబర్ క్రైమ్ అవేర్నెస్‌లో సైబర్ క్రైమ్ గురించి అవగాహన కల్పించారు. అలాగే కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పారు. సైబర్ క్రైమ్ జరిగినప్పుడు తప్పనిసరిగా 1930కి కాల్ చేసి తమ యొక్క ఫిర్యాదును నమోదు చేసుకోవాలని కోరారు. దానితో మరొక సైబర్ క్రైమ్ జరగకుండా అడ్డుకట్ట వెయ్యవచ్చు అన్నారు. అలాగే ఒకవేళ సైబర్ క్రైమ్ వల్ల లావాదేవీలలో ఇబ్బందులు ఎదురైతే వాటిని వీలైనంత త్వరగా తెలియజేయాలన్నారు. అయితే ఎకౌంట్ ఫ్రీజ్ చేయడానికి ఆస్కారం ఉంటుందని, లేనియెడల ఆలస్యం అయినచో డబ్బులు రికవరీ చేయడం కష్టమవుతుందని తెలిపారు. అలాగే వాట్సాప్‌లో మేము పోలీసులమని బెదిరింపు కాల్స్ వస్తే భయపడకుండా అలాంటి కాల్స్‌ని కట్ చేసి మీకు దగ్గరలో ఉన్న సైబర్ క్రైమ్ టీమ్‌కి తెలియజేసినట్లు అయితే నేరాలన్నీ అదుపులోకి తీసుకురావచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గని మేనేజర్ ఇజ్జగిరి శివయ్య, డి గణేష్ వెల్ఫేర్ ఆఫీసర్, సల్మాన్ ఖాన్ సెక్షన్ ఇంచార్జ్, జి. కుమారస్వామి వెంటిలేషన్ ఆఫీసర, గని అధికారులు, పొన్నాల వెంకటయ్య పిట్ సెక్రటరీ, సూపర్వైజర్లు, మహిళా ఉద్యోగులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల సేవలు అమోఘం

**- రామగుండం మేయర్ మహంకాళి స్వామి**



**వాస్తవం , గోదావరిఖని, ఆగస్ట్ 13:**

రామగుండం నగరాన్ని పరిశుభ్రంగా , ఆరోగ్యకరంగా ఉంచడంలో పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు అమోఘమని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ ప్రజారోగ్య విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న రెగ్యులర్ , ఔట్ సోర్స్ కార్మికులకు ఏకరూప దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం కార్యాలయంలో ప్రారంభించారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి తమ పాలక వర్గం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం నుండి వారికి అందవల్సిన ప్రయోజనాలను సకాలంలో వచ్చేట్టు చూస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఒక్కొకరికి రెండు జతల దుస్తులు , రెండు తువ్వాలలు సుమారు 400 మంది సిబ్బందికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్, జూనియర్ అసిస్టెంట్ చంద్రా రెడ్డి, పారిశుధ్య విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్లాసిఫైడ్స్

**CHENGE OF NAME**

RONTALA RAMESH DEVE S/O
SARAIAH PLOT. NO-48
INDIRAMMA COLONY, GUNDALASINGARAM
(V&M) HANAMKONDA(DIST),T. S.
I HAVE CHANGED MY SON NAME
FROM RONTALA EMMANUEL (OLD NAME)
TO RONTALA NEHANTH (NEW NAME)
FROM ALL FUTURE PURPOSES

**CHENGE OF NAME**

RONTALA RAMESH DEVE S/O
SARAIAH PLOT. NO-48
INDIRAMMA COLONY, GUNDALASINGARAM
(V&M) HANAMKONDA(DIST),T. S.
I HAVE CHANGED MY DAUGHTER NAME
FROM RONTALA NISSI (OLD NAME)
TO RONTALA NEHA (NEW NAME)
FROM ALL FUTURE PURPOSES

**CHENGE OF NAME**

RONTALA RAMESH DEVE S/O
SARAIAH PLOT. NO-48
INDIRAMMA COLONY, GUNDALASINGARAM
(V&M) HANAMKONDA (DIST),T. S.
I HAVE CHANGED MY DAUGHTER NAME
FROM RONTALA HONEY (OLD NAME)
TO RONTALA VIHANA (NEW NAME)
FROM ALL FUTURE PURPOSES

# పాఠశాలకు నూతన తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటు



వాస్తవం : బీర్కూర్

కిష్టాపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తాగునీటి సమస్యకు పరిష్కారం లభించనుంది. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులను గురువారం ప్రారంభించారు. పాఠశాలలో తాగునీటి సౌకర్యం మెరుగుపరిచే లక్ష్యంతో చేపట్టిన ఈ పనులతో విద్యార్థులకు ఇకపై నీటి ఇబ్బందులు తొలగనున్నాయి. పాఠశాల ఆవరణలోనే తాగునీరు అందుబాటులోకి రావడంతో విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని గ్రామ పంచాయతీ ప్రతినిధులు తెలిపారు. పైప్‌లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి సరఫరాను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ మానేవ్వ గంగౌండ, ఉపసర్పంచ్ కృష్ణ, వార్డు సభ్యులు కృష్ణ, బీరప్ప, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్పోర్ట్స్ యూనిఫామ్ లు పంపిణీ



వాస్తవం : వేములవాడ

వేములవాడ మండలం మల్లారం గ్రామ అనుబంధమైన రాజానగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో కొత్తగా చేరిన 15 మంది విద్యార్థులకు గురువారం పాఠశాల ఉపాధ్యాయులు లింగంపల్లి రాజు, తెల్ల వకుల లు తమ స్వంత ఖర్చులతో స్పోర్ట్స్ యూనిఫామ్ లు పంపిణీ చేశారు. పాఠశాల తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

# జర్నలిస్టుల హక్కుల కోసం ఐజెయు నిరంతరం కృషి



## రాష్ట్ర అధ్యక్షులు విరహత్ అలీ

వాస్తవం : అందోల్

జర్నలిస్టుల హక్కులు భద్రత సంక్షేమ కోసం తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ఐజేయు నిరంతరం కృషి చేస్తూనే ఉందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు విరహత అలీ తెలిపారు. హైదరాబాదులోని రాష్ట్ర యూనియన్ కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా నూతన కమిటీ పటాన్చెరు నూతన కమిటీ సభ్యులు సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బందారు యాదగిరి ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిని పూలమాలు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డిలో ఇటీవల నిర్వహించిన జిల్లా మహాసభలను విజయవంతం చేసినందుకు యాదగిరిని ఆయన అభినందించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఇదివరకే ప్రభుత్వంతో పలు దాపాలు చర్చలు జరిపామని, త్వరలోనే అర్హులైన జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇంటి స్థలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

# ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పించాలి

## రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలి

## రోగులకు కౌన్సెలింగ్, మెరుగైన వైద్యం అందించాలి

## రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



వాస్తవం : రాజన్న సిరిసిల్ల ప్రతినిధి

ఎయిడ్స్ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఎయిడ్స్ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా సంక్షేమ శాఖ, విద్య, యువజన శాఖ, జడ్పీ సీఈవో, తదితర అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సమన్వయ సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఎన్ని ఉన్నాయి? వారు ఎక్కడ వైద్య సేవలు పొందుతున్నారు? మందులు, కౌన్సెలింగ్ తదితర సేవలు ఎక్కడ పొందుతున్నారని అధికారులను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లాలో మొత్తం 1283 పాజిటివ్ కేసులు ఉన్నాయని, వారికి నెలనెలా మందులు అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.....అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఎయిడ్స్ రోగ నిర్ధారణ పరీక్షలు చేయాలని, రోగులకు నిరంతరం వైద్యం, మందులు, కౌన్సెలింగ్ చేయాలని సూచించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. పాజిటివ్ కేసులు వచ్చిన చోట పకడ్బందీగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఒక షెడ్యూల్ సిద్ధం చేయాలని, దాని ప్రకారం పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. యువత, విద్యార్థులకు అవగాహన సమావేశాలు, పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీ జీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్షుడిగా కొండ బిక్షపతి

## నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్



వాస్తవం : వర్ధన్నపేట

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నూతన అధ్యక్షుడిగా కొండ బిక్షపతి, ఉపాధ్యక్షుడిగా దోలి శ్యాంసుందర్ ఎన్నికయ్యారు. ఎన్నికల్లో విజయం సాధించిన పాలకవర్గ సభ్యులు వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఈ సందర్భంగా నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ జక్కి అనిత శ్రీకాంత్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గ సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మత్స్య పారిశ్రామిక సహకార సంఘానికి గ్రామపంచాయతీ తరఫున ఎల్లవేళలా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సంఘాన్ని బలోపేతం చేస్తూ గ్రామ అభివృద్ధికి పాలకవర్గం కృషి చేయాలని, నూతన అధ్యక్షుడు కొండ బిక్షపతి సంఘ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేయాలని ఆకాంక్షించారు. నూతన అధ్యక్షుడు కొండ బిక్షపతి మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన కుల సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తన ప్యానల్ పూర్తి మెజార్టీ సాధించడం సంతోషంగా ఉందని, మత్స్య సహకార సంఘం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి షేక్ హుస్సేన్, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం మాజీ అధ్యక్షులు ఎలబోయిన వీరయ్య, దోలి సారయ్య, గ్రామ వార్డు సభ్యుడు వెలబోయిన సదానందం, మహమ్మద్ జాఫర్, మారిపట్ల బాబు, శ్రీపాది శ్రీనివాస్, బిర్రు రాములు, బిర్రు యాకయ్య, నూతన పాలకవర్గ సభ్యులు చింతకాయల భద్రయ్య, ఎలబోయిన సుధాకర్, తోట రాజేందర్, వంశీ, వాకిటి సతీష్, ఎలబోయిన చంద్రకళ, పొన్నం లింగమ్మతో పాటు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దేవరాంపల్లి, దామరకుంటలో వైద్య శిబిరాలు



వాస్తవం : కాటారం

కాటారం మండలంలోని దేవరాంపల్లి, దామరకుంట గ్రామాల్లో ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. దేవరాంపల్లిలో కాలానుగుణ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ జ్వరాలు, విరేచనాలు, శ్వాసకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి డాక్టర్ మౌనిక సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పరిశుభ్రమైన నీరు, ఆహారం తీసుకోవాలని, జ్వరం, వాంతులు, విరేచనాలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. అలాగే దామరకుంటలో ఉచిత వైద్య శిబిరంతో పాటు హెచ్‌పీవీ టీకా కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్ వందన, మహిళా ఆరోగ్య సూపర్‌వైజర్ సరళ, ఆరోగ్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ప్రజలు ఆరోగ్యశాఖ సూచనలు పాటించి వ్యాధుల నివారణకు సహకరించాలని వైద్య సిబ్బంది కోరారు.

# పోలీసుల పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా నిందితుల అరెస్ట్

## రూ.15 లక్షల వరకు మోసం- నిందితులపై రెండు తెలుగు రాష్ట్రాల్లో 28కి పైగా కేసులు వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు



వాస్తవం : చందుర్తి

పోలీసుల పేరుతో సైబర్ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. చందుర్తి సర్కిల్ పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ శ్రీనివాసులు వివరిస్తూ.. ..నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన కట్కూరి శరత్ కుమార్ (31) అనే వ్యక్తులు హైదరాబాదులోని మీర్ పేటలో నివాస ఉంటూ మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్సాక్షన్ సెంటర్ల కు సంబంధించిన ఫోన్ నంబర్లను గూగుల్, టెలిగ్రామ్ ద్వారా సేకరిస్తు అమాయక బాధితులకు ఫోన్ చేసి, తాము ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి అని పోలీస్ అధికారిగా పరిచయం చేసుకుని, పోలీస్ అధికారులకు అత్యవసరంగా హాస్పిటల్ ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయని, వెంటనే ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపించాలని నమ్మించి, నిందితులు తమ నేరానికి అనుగుణంగా ముందుగానే ఒక పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి, తమ వాహనం లేదా బోర్ బండి రిపేర్‌కు వచ్చిందని, తమ సార్ వారి ఫోన్ నంబర్‌కు డబ్బులు పంపిస్తారని చెప్పి వారి నంబర్‌ను తీసుకుని, ఆ నంబర్‌ను మీసేవ నిర్వాహకులకు ఇచ్చి, బాధితుల నుంచి ఆన్‌లైన్‌లో డబ్బులు బదిలీ చేయించేవారని, డబ్బులు బదిలీ అయిన అనంతరం నిందితులు పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి నగదును తీసుకునేవారని తెలిపారు. ఇందులో భాగంగా నిందితులు సాయిచంద్, శరత్ కుమార్‌లు చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్ స్టేషన్ నుంచి ఏఎస్ఐ శ్రీనివాస్ రెడ్డిగా మాట్లాడుతున్నామని పరిచయం చేసుకున్నారు. తన బాబు ఆరోగ్యం బాగాలేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించామని, అత్యవసరంగా రూ.70 వేలు అవసరముందని, డబ్బులు పంపిస్తే హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఇస్తానని పెంటయ్యను నమ్మించారు. నిందితులు చెప్పిన మాటలను నిజమని నమ్మిన చిలుక పెంటయ్య డబ్బులు పంపేందుకు సిద్ధం కాగా, నిందితులు హైదరాబాద్‌కు చెందిన ఒక పెట్రోల్ బంక్ ఫోన్ నంబర్‌ను అతనికి ఇవ్వడంతో ఆ నంబర్‌కు రూ.70 వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. డబ్బులు పంపిన అనంతరం నిందితులు తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసుకోవడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన పెంటయ్య చందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఫిర్యాదు మేరకు చందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చందుర్తి సీఐ కట్ల రవీందర్, ఎస్ఐ జిల్లెల్ల రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సాంకేతిక ఆధారాలు ఉపయోగించి నిందితులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి, నిందితుల నుంచి నేరం ద్వారా సమకూరిన సొమ్ములో రూ.18,000 నగదు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులను స్వాధీనం చేసుకొని రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి నిందుతులను అరెస్టే చేసిన సిఐ రవీందర్, ఎస్.ఐ రమేష్, ఆర్.ఎస్.ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డి లను డిఎస్పీ అభినందించారు.

# విద్యతో సాంకేతిక నైపుణ్యాలు అలవర్చుకోవాలి

## శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి యు.ఉమేష్ కుమార్




వాస్తవం : హుస్నాబాద్

విద్యతో పాటు విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలు అలవర్చుకోవాలని శాతవాహన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న కార్యాశాల ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.సాధారణ విద్యతో పాటు సాంకేతిక నైపుణ్యాలను అలవర్చుకోవాల్సిన అవసరాన్ని నొక్కి వక్కాణించారు. విద్యార్థులు కేవలం డిగ్రీ పట్టాలను కలిగి ఉంటే ఉపాధి అవకాశాలను పొందలేరని, విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యాన్ని, కృత్రిమ మేధను ఉపయోగించుకోవాలని తెలిపారు. పరిశోధనా రంగంలో మెరుగైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఉన్నత విద్యాభ్యాసం ద్వారా విద్యార్థులు పరిశోధన రంగాలను ఎంచుకోవాలని హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విజయగిరి విక్షపతి కళాశాలలో జరుగుతున్న విద్యార్థి కేంద్రీకృత కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు సాంకేతిక నైపుణ్యాలను అందించడం కోసం ఉచితంగా కంప్యూటర్ విజ్ఞానాన్ని విద్యార్థులతో పాటు హుస్నాబాద్ లోని యువతకు అందిస్తున్నామని తెలిపారు. వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యశాలలో విద్యార్థులు నేర్చుకున్న అంశాల నివేదికను కార్యశాల కన్వీనర్ డా. వి. చంద్రమౌళి వివరించారు. కళాశాలలో ఉన్న విద్యార్థులతో పాటు ఇతర కళాశాల విద్యార్థులు కూడా మూడు రోజులపాటు ట్యాలీ ద్వారా పన్నుల నమోదు, ఆదాయ వివరాల నమోదు మొదలగు అంశాల పైన శిక్షణ పొందినట్లు తెలిపారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఉపకులపతిని మరియు రిసోర్స్ పర్సన్స్ ను ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు పుష్పగుచ్చాలు మరియు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి ఊరిలో... ప్రతి గల్లీలో జాతీయ జెండా ఎగురవేద్దాం

## చిలుకూరు పేరెంట్స్ కళాశాల పాఠశాల కమిటీ చైర్మన్ నక్క మాణిక్యం



వాస్తవం చేవెళ్ల

చేవెళ్ల నియోజకవర్గ ప్రజలకు నక్క మాణిక్యం విజ్ఞప్తి చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రతి ఊరిలో, ప్రతి పల్లెలో, ప్రతి మండలంలో, ప్రతి +నవీజ పరిధిలో, ప్రతి వీధిలో, ప్రతి గల్లీలో ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తూ జాతీయ జెండాను గర్వంగా ఆవిష్కరించాలని చిలుకూరు పేరెంట్స్ కళాశాల పాఠశాల కమిటీ చైర్మన్ నక్క మాణిక్యం ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జాతీయ జెండా కేవలం మూడు రంగుల వస్త్రం కాదని, అది ఎందరో స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలకు ప్రతీక, దేశ గౌరవానికి చిహ్నం, భారతదేశ ఐక్యతకు ప్రతిరూపం అని ఆయన పేర్కొన్నారు.మన దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను సైతం త్యాగం చేసిన మహనీయులను స్మరించుకుంటూ, ప్రతి ఒక్కరూ దేశభక్తి స్ఫూర్తితో ఆగస్టు 15న జాతీయ జెండాను ఆవిష్కరించాలని కోరారు."ప్రతి ఇంటా జాతీయ జెండా... ప్రతి గుండెలో దేశభక్తి... ప్రతి అడుగులో దేశ సేవ!" అనే స్ఫూర్తితో చేవెళ్ల నియోజకవర్గాన్ని దేశభక్తి చాటేలా నిలబెట్టాలని పిలుపునిచ్చారు.

# ప్రకృతి బ్లెస్సికి వైద్యులు ఘన సన్మానం



వాస్తవం : కోనరావుపేట

రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం సుద్దాల గ్రామానికి చెందిన ప్రకృతి బ్లెస్సి (11) ప్రస్తుతం బద్దెనపల్లి గురుకులాలో ఏడో తరగతి చదువుతుంది. ప్రకృతి పర్యావరణ పరిరక్షణ కోసం అతి పిన్న వయసు నుండి పది సంవత్సరాలుగా ప్రకృతి అడవుల సంరక్షణ కోసం విశేష కృషి చేస్తూ "ఐ రేంజ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్" సాధించిన చిన్నారి ప్రకృతి బ్లెస్సిని గురువారం సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ రమణరావు, డాక్టర్ శ్రీవాణి దంపతులు, రిజర్వు సబ్ ఇన్స్ స్పెక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అక్షయ్ ల సమక్షంలో తమ ఆసుపత్రి ప్రాంగణంలో చిన్నారి బ్లెస్సిని ఘనంగా అభినందించారు.చిన్న వయసులోనే పర్యావరణ పరిరక్షణపై అపారమైన అవగాహన పెంచుకుని సమాజంలో చైతన్యం తెచ్చేందుకు ప్రకృతి బ్లెస్సి చేస్తున్న సేవలు ఎందరికో ఆదర్శనీయమని , బ్లెస్సి మూడవ సంవత్సరం నుండి ప్రకృతి సంరక్షణ కోసం విత్తనాలను సేకరించి విత్తన బంతులను చేసి అడవుల్లోకి వెళ్లి విత్తనాలను చల్లడం అతి చిన్న వయసులో ప్రాణవాయువును ఇచ్చే ప్రకృతికే ప్రాణం పోస్తున్న చిన్నారి ప్రకృతి బ్లెస్సి తాను అడవుల్లో నాటుతున్న విత్తు, భావితరాలకు భవిష్యత్తు అని డాక్టర్ రమణరావు, డాక్టర్ శ్రీవాణి కొనియాడారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల

ప్రకటనల కోసం సంప్రదించండి

8074124190

వాస్తవం

# బెస్ట్ అవైలబుల్ పాఠశాల ఎంపికలో గందరగోళం

## విద్య ప్రతి ఒక్క పేద విద్యార్థికి అందించాలని డిమాండ్

వాస్తవం : నిర్మల్ ప్రతినిధి

నిర్మల్ జిల్లా కేంద్రంలోని కార్పొరేట్ విద్యను పేద దళిత విద్యార్థులకు అందించాలని ఉద్దేశంతో బి ఏ ఎస్ఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు కమిటీ గురువారం రోజున సమస్యను ప్రభుత్వానికి తీసుకెళ్లారు ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవైలబుల్ స్కూల్ విషయంలో నెలకొన్న గందరగోళ పరిస్థితికి పేద విద్యార్థులు బలి అయ్యే పరిస్థితి నెలకొని ఉంది అని ప్రశ్నించారు దీంతో తల్లిదండ్రులు అధికారుల కార్యాలయం చుట్టూ తిరిగిన పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల ఒక ప్రైవేట్ పాఠశాలల్లో నెలకొన్న సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం జిల్లాకేంద్రంలో విద్యావ్యవస్థ ఎలా ఉందో అర్థమవుతుందని పలువురు ప్రత్యక్షంగానే విమర్శిస్తున్నారు. దీంతో వారికి న్యాయం జరిగే విధంగా బి ఏ ఎస్ఎస్ స్కీమ్ ని పక్కాగా అన్ని వసతులు ఉన్న పాఠశాలలో అమలు చేయాలని



కోరుతూ హైదరాబాద్లో గల బాలల హక్కుల కమిషన్ చైర్మన్ మెంబర్ లలిత అగర్వాల్ మరియు ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అదనపు సంచాలకులు శ్రీధర్, రాష్ట్ర పాఠశాలల విద్యాశాఖ కార్యదర్శి నవీన్ ను విద్యార్థులు కలిసి బి ఏ ఎస్ ఎస్ విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ పత్రాలను అందజేశారు.

# హమాలీ కార్మికులకు ఆరోగ్య భద్రత కార్డులు ఇప్పించాలి



వాస్తవం : ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లి, బొప్పాపూర్ గ్రామాలకు చెందిన హమాలీ సంఘం యూనియన్ నాయకులు, సభ్యులు గురువారం మండల తహసీల్దార్ సుజా తకు వినతిపత్రం సమర్పించారు. హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.కార్మికులకు ఆరోగ్య భద్రత కార్డులు మంజూరు చేయడంతో పాటు, ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. హమాలీ కార్మికుల ఆరోగ్య భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంఘం నాయకులు కోరారు.

# ఆటల్లో గెలుపు,ఓటములు సహజం

## ప్రిన్సిపల్ వేముల గణేష్

వాస్తవం : హుస్నాబాద్

ఆటల్లో గెలుపు, ఓటములు సహజమని శ్రీ అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వేముల గణేష్ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్తులకు గురువారం ఆటల పోటీలను నిర్వహించారు. ఇందులో భాగంగా క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ పోటిలో గద్ద మనీష్ జట్టు మాలోత్ సతీష్ జట్టుపై 7 పరుగుల తేడాతో గెలుపొందారు. గెలిచిన జట్టు సభ్యులను కళాశాల ప్రిన్సిపాల్ వేముల గణేష్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ....ఆటలలో గెలుపు, ఓటములు సహజమని నిరాశ చెందకుండా విజయం కోసం ప్రయత్నం చేయాలని చెప్పారు. అలాగే ప్రతి సంవత్సరం విద్యార్థులకు



చదువుతో పాటు మానసిక మరియు శారీరక ఆరోగ్యం కోసం క్యారమ్, చెస్, కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్, స్కిప్పింగ్, క్రికెట్, మ్యూజికల్ చైర్ ఆటలను నిర్వహిస్తామని తేలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం సంధ్య, ప్రశాంత్,అనూష, నవ్య, స్వప్న అద్యపకేతర బృందం శరత్,అరుణ విద్యార్థులు పాల్గొన్నారు.

# శివరాంపల్లిలో తిరంగా ర్యాలీ



వాస్తవం : రాజేంద్రనగర్

రాజేంద్రనగర్ శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 294 నుండి ప్రజా భవన్ వరకు బిజెపి నాయకులు తిరంగా ర్యాలీ నిర్వహించారు. గురువారం బిజెపి గోల్కొండ ఇన్చార్జ్ వై. శ్రీధర్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్, సదాల రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన తిరంగా ర్యాలీలో స్థానిక పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేసి దేశ ఐక్యతను చాటాలని వై. శ్రీధర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మల్లేష్ యాదవ్ రాష్ట్ర మహిళా మోర్చా కార్యదర్శి స్వర్ణలత రెడ్డి, కోరని సదానంద్, హరికిషన్, సోల్కర్ రెడ్డి, బాబురావు, పి.వాసు, బాలకృష్ణ, నర్సింగరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# కారు ఢీకొని యాకుబ్ మృతి

## ప్రమాదానికి కారణమైన వాహనం గుర్తింపు

## సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

వాస్తవం : వర్ధన్నపేట

వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహ్మద్ యాకుబ్ (58) చికిత్స పొందుతూ మృతి చెందారు. హనుమాన్ గుడి సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని కారు ఢీకొనడంతో యాకుబ్ తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న 108 సిబ్బంది వెంటనే ఘటనాస్థలికి చేరుకుని యాకుబ్ను ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.కారు గుర్తింపు.. దర్యాప్తు వేగవం





తం ప్రమాదానికి కారణమైన కారును పోలీసులు గుర్తించిన ట్లు సమాచారం. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలను సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు సేకరిస్తున్నారు. వా హనం, డ్రైవర్కు సంబంధించిన వివరాలను పోలీసులు పరి శీలిస్తున్నట్లు సమాచారం.

# ప్రభుత్వ పాఠశాలలకు ప్యూరిఫైడ్ వాటర్ యంత్రాల వితరణ



వాస్తవం : చందుర్తి

చందుర్తి మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం కోసం నాలుగు ప్యూరిఫైడ్ వాటర్ యంత్రాలను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గురువారం విరాళంగా అందజేశారు. మండలంలో రామన్నపేట, చందుర్తి, మూడపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం స్టేట్ బ్యాంకు ఆధ్వర్యంలో శుద్ధ జల కేంద్రాలను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ పద్మజారాణి మాట్లాడుతూ.... విద్యార్థులకు స్వచ్ఛమైన మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ యంత్రాలను అందజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పులి సత్యం గౌడ్, పోతరాజు భారతి- నగేష్, చిలుక మల్లేశ్వరి- అంజిబాబు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది సాహిత్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.పాఠశాలకు వాటర్ ప్లాంట్ ను అందజేసిన స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్ట్ సంక్షేమ సంఘం
Red 914/2015
జర్నలిస్ట్ల సంక్షేమమే పరమావధిగా
జర్నలిస్ట్ల హక్కుల కోసం....
వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...
సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం॥ 9618616110

# కూటిగల్‌లో అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు



వాస్తవం : మద్దూరు

దూల్మిట్ట మండల పరిధిలోని కూటిగల్ గ్రామ పరిధిలోని నల్ల చెరువు, బుస్సకుంట చెరువు నుంచి అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్న ఘటనపై అధికారులు చర్యలు చేపట్టారు. కూటిగల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థన మేరకు చెరువుల నుంచి మట్టి తవ్వకాలకు అనుమతి కోరిన నేపథ్యంలో అధికారులు పరిశీలన చేపట్టారు. దూల్మిట్ట తహసీల్దార్ గజ్వేల్ ఇరిగేషన్ విభాగం అధికారులు, కూటిగల్ గ్రామ జీపీఓ, తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గ్రామంలో నాలుగు అక్రమ మట్టి డంప్‌లను గుర్తించినట్లు అధికారులు నివేదికలో పేర్కొన్నారు. చెరువుల నుంచి అక్రమంగా మట్టి తవ్వి రైతుల భూముల్లో డంప్ చేసినట్లు తనిఖీల్లో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ఈ మట్టిని ఇటుకల తయారీకి వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అక్రమంగా తవ్విన మట్టితో ఏర్పాటు చేసిన నాలుగు డంప్‌లను అధికారులు స్వాధీనం చేసుకుని, సురక్షిత పరిరక్షణ కోసం గ్రామ జీపీఓకు అప్పగించారు. మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం జరిమానా విధించేందుకు తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు దూళిమిట్ట తహసీల్దార్ శామ్ పేర్కొన్నారు.

# సీజనల్ వ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరం



వాస్తవం : వర్ధన్నపేట

వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్య ఉపకేంద్రం--2 ఆధ్వర్యంలో డాక్టర్ సురేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ శిబిరంలో గ్రామస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. దోమల నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదిం చాలని అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ బేతి సాంబయ్య, వార్డు సభ్యులు జోగుల అనూష, తుల్ల శైలజ, ఏఎన్ఎం సరోజ, ఆశా కార్యకర్త అపరంజి, వైద్య సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని జోనల్ కమిషనర్‌కు వినతి




వాస్తవం : రాజేంద్రనగర్


రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డిని బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రంపల్లి శ్యామల రాజ్ కలిసి అర్హులైన వారికే ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. గురువారం జోనల్ కార్యాలయంలో ఆయన స్థానిక సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఇంతకు మునుపు దళిత బంధు పథకంలో అనర్హులకే లబ్ధి చేకూరిందని అన్నారు. చాలీచాలని వేతనాలతో బతుకులు ఈడ్చే పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వపరంగా రావలసిన బెనిఫిట్స్ జీవోల అమలుకు చొరవ చూపాలన్నారు. వారి వేతనాల పెంపుకు సహకారం అందించాలని కోరారు. అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం సందర్భాలు చాలా ఉన్నాయని వాటిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి తోపాటు పలు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ కమిషనర్ కు వినతిపత్రం అందజేయడం జరిగిందని శామల్ రాజ్ తెలిపారు.






# దిగొచ్చిన బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

## నల్సార్ వర్సిటీ విద్యార్థులు అడ్వకేట్లుగా నమోదు చేసుకోవచ్చని ప్రకటన




దేశ వ్యాప్తంగా లాయర్లు, ప్రతిపక్షాల నుంచి వెల్లువెత్తిన నిరసనల అనంతరం బార్ కౌన్సిల్ అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్రా ప్రకటన విడుదల



హైదరాబాద్ ‘నల్సార్’ విశ్వవిద్యాలయం చుట్టూ తిరుగుతున్న రాజకీయ, న్యాయపో రాటం అనూహ్య మలుపులు తిరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కాన్వొకేషన్‌కు ముఖ్య అతిథిగా పిలవడాన్ని నిరసిస్తూ కొంత మంది విద్యార్థులు చేపట్టిన ఉద్యమం తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారంలో అత్యంత ఘాటుగా స్పందించిన భారత బార్ కౌన్సిల్ , నల్సార్ 2026 బ్యాచ్‌కి చెందిన లా విద్యార్థులెవ్వరినీ అడ్వకేట్లుగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సిల్స్‌కు సం చలన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయంపై నలుమూలల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవ్వడం, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో బీసీఐ కొద్ది గంటల్లోనే తన ఆదేశాలను సవరించుకుని నిషేధాన్ని ఉపసంహరించుకుంది.

**ఢిల్లీ :** హైదరాబాద్ ‘నల్సార్’ విశ్వవిద్యాలయం చుట్టూ తిరుగుతున్న రాజకీయ, న్యాయపో రాటం అనూహ్య మలుపులు తిరిగింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్‌ను కాన్వొకేషన్‌కు ముఖ్య అతిథిగా పిలవడాన్ని నిరసిస్తూ కొంత మంది విద్యార్థులు చేపట్టిన ఉద్యమం తీవ్ర దుమారం రేపింది. ఈ వ్యవహారం లో అత్యంత ఘాటుగా స్పందించిన భారత బార్ కౌన్సిల్ , నల్సార్ 2026 బ్యాచ్‌కి చెందిన లా విద్యార్థులెవ్వరినీ అడ్వకేట్లుగా నమోదు చేయకూడదని రాష్ట్ర బార్ కౌన్సి ల్స్‌కు సంచలన ఆదేశాలు జారీ చేసింది. అయితే, ఈ నిర్ణయంపై నలుమూలల నుంచి తీవ్ర ఆగ్రహం వ్యక్తమవ్వడం, విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారడంతో బీసీఐ కొద్ది గంటల్లోనే తన ఆదేశాలను సవరించుకుని నిషేధాన్ని ఉపసంహరించుకుంది. దేశ వ్యాప్తంగా లాయర్లు, ప్రతిపక్షాల నుంచి వెల్లువెత్తిన నిరసనల అనంతరం బార్ కౌన్సిల్ అధ్యక్షుడు మనన్ కుమార్ మిశ్రా ఒక ప్రకటన విడుదల చేశారు. నల్సార్ 2026 బ్యాచ్‌లోని అర్హులైన విద్యార్థులందరూ ఎప్పటిలాగే తమకు నచ్చిన రాష్ట్ర బార్ కౌన్సిల్‌లో అడ్వకేట్లుగా నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. “ఏ ఒక్క విద్యార్థి తప్పు లేకుండా శిక్షను అనుభవించకూడదనే ఉద్దేశంతోనే మునుపటి ఆదేశాలను సవరించాం. అయితే, ఈ వివాదంపై అసలు నిజాలను తేల్చేందుకు విచారణ కొనసాగుతుంది. నివే దిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి” అని ఆయన వెల్లడించారు. దేశ అత్యు న్నత న్యాయస్థానాన్ని గౌరవించని వారు భవిష్యత్తులో మంచి న్యాయవాదులుగా లేదా న్యాయమూర్తులుగా రాణించలేరని, ఇది వృత్తిపరమైన క్రమశిక్షణకు విరుద్ధమని బీసీఐ అభిప్రాయపడింది. జంతర్ మంతర్ వద్ద ‘కాక్రోచ్ జనతా పార్టీ’ నిర్వహించిన ‘చలో సంసద్’ నిరసనల సందర్భంగా పోలీసుల లాఠీచార్జ్, పెల్లెట్ తుపాకుల వినియోగంపై వివాదం చెలరేగింది. నీట్ పరీక్షలు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుకు నిరసనగా జరిగిన ఈ ప్రదర్శనపై పోలీసులు దౌర్జన్యానికి పాల్పడ్డారంటూ జులై 22న సుప్రీంకోర్టులో అత్యవసర విచారణ కోరారు. ఆ సమయంలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం “మా సమయాన్ని, మీ సమయాన్ని వృథా చేయకండి.. మేము ఎలాంటి వీడియోలు చూడము” అని వ్యాఖ్యానించినట్లు వార్తలు వచ్చాయి. ఈ వ్యాఖ్యలను నిరసిస్తూ నల్సార్ వర్సిటీ కాన్వొకేషన్‌కు సీజేఐని ఆహ్వానించవద్దని కోరుతూ కొంతమంది విద్యార్థులు వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్లకు వినతిపత్రం ఇచ్చారు. ఇదే వివాదానికి మూలకారంగా మారింది.


జర్నలిస్ట్స్ సంక్షేమ సంఘం

Red 914/2015

జర్నలిస్ట్స్ సంక్షేమమే పరమావధిగా

జర్నలిస్ట్స్ హక్కుల కోసం....

వాళ్ల ప్రగతి కోసం... పత్రికా స్వేచ్ఛ కోసం...

సభ్యత్వ నమోదు కోసం సంప్రదించండి సెల్ నెం:: 9618616110